క్లుప్తంగా

బోనాల సందడి



దోర్నకల్: మండలంలోని గుర్రాలకుంట(దాన్యాతండా)లో ఆదివారం ముత్యాలమ్మ తల్లికి బోనాలు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మహిళలు గ్రామంలోని బొడ్రాయికి జలాభిషేకం చేసిన అనంతరం బోనాలతో ఊరేగింపు నిర్వహించి ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

పీరీల ఊరేగింపు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు పరిధిలోని బేతోలు గ్రామంలో పీరీల సవార్ల సందడి ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. మత సామరస్యానికి ప్రతికగా హిందూ ముస్లింలు సోదర భావంతో మొహరం వేడుకలు పల్లెల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ యూసుఫ్, షేక్ మస్తాన్, షేక్ మదార్ పాల్గొన్నారు.

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) శివారు తాట్య తండా గ్రామంలో ఆదివారం పీరీలతో ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం, గిరిజనులు ఊరేగింపులో పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

దోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటి పరిధి 15వ వార్డులోని లక్ష్మిటాకీస్ రోడ్డులో వర్షంతో ఏర్పడిన బురద గుంతను మట్టితో పూడ్చారు. రోడ్డుపై వరద నీటితో ఏర్పడిన గుంతతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం కాగా స్పందించిన కౌన్సిలర్ మోనికా యశోధర్‌జైన్ ఆదివారం సొంత ఖర్చులతో రాళ్లు, మట్టి పోయించి గుంతను పూడ్చారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



మహబూబాబాద్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రావుల రవిచందర్‌రెడ్డి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని దైవకృప అనాథ ఆశ్రమంలో పిల్లలకు ఆట వస్తువులతోపాటు నిర్వాహకుడు లోకేష్‌కు నిత్యావసర వస్తువులను అందజేశారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యుడు పర్కాల రవీందర్ రెడ్డి, లక్ష్మి కుమార్తె ప్రియరాగా రెడ్డి జన్మదిన వేడుకలను అనాథ పిల్లల మధ్య నిర్వహించారు. కార్యక్రమంలో యాళ్ల మురళీధర్‌రెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి, సుదాకర్, కాశీనాద్, ఇంద్రనీల్‌రెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



నెల్లికుదురు: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్ననాగారంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు నాయిని మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పొలంలో పాడి గేదె మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ మోటార్ సర్వీస్ వైరుకు గేదె తగిలి షాక్‌తో మృతి చెందినట్లు మల్లయ్య తెలిపాడు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఈనెల 15,16,17 తేదీల్లో హనుమకొండలో జరగనున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్రస్థాయి రాజకీయ, సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పులిపాక నాగరాజు, రవి, కిషన్, హేమా నాయక్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. కాటేస్తాయ్..!

- వర్షాకాలంలో పాముల బెడద
- పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదాలు
- పిచ్చి మొక్కల వద్ద ఎక్కువగా సంచారం

పెద్దవంగర: వర్షాకాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పుట్టలు, పొదల్లోకి వర్షపు నీరు చేరడం ద్వారా అవి బయటకు వస్తుంటాయి. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న పాము కాటుకు గురి కాక తప్పదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధికమించ వచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.



నాగుపాము

ఏటా జూన్ చివరి వారం నుంచి సెప్టెంబర్ వరకు పాములు ఇతర విష కీటకాల బెడద ఉంటుంది. ముఖ్యంగా పాములు, ఎలుకలను, కప్పలను తినేందుకు బయట తిరుగుతూ చెట్ల పొదల్లో ఉంటాయి. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏదైన ప్రమాదం సంభవించినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు కామా ఆకారపు గుర్తులు పడుతాయి. అరగంటలోపు విషం ఒళ్లంతా పాకి నాడి వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. కళ్లు మూతలు పడడం, చేతులు కాళ్లకు తాత్కాలికంగా పక్షవాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పాముకాటు వేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో గట్టిగా కట్టాలి. దీంతో విషం శరీరంలోకి వ్యాపించదు. కట్టును పది నిమిషాలకు ఒకసారి వదిలి మళ్లీ కడుతుండాలి. సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. విషానికి యాంటీవీనమ్ తీసుకుంటే ప్రాణపాయం నుంచి తప్పించుకోవచ్చు. రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లే రైతులు శబ్దం చేస్తూ టార్చిలైట్ వెంట తీసుకెళ్లాలి.

ఆందోళన చెందాల్సిన పనిలేదు..



పాము కాటువేస్తే ఆందోళన చెందాల్సిన పనిలేదు. పాము కాటునుంచి రక్షించుకునేందుకు అప్రమత్తత అవసరం. పాము కాటుకు గురైతే యాంటీవీనమ్(ఏఎస్‌వీ) మందు ప్రాథమిక కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి. కాటు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. - డాక్టర్ జ్వలిత, పీహెచ్‌సీ, తొర్రూరు

నాటు మందు వాడకం సరికాదు



చాలా ప్రాంతాల్లో పాము కాటుకు స్థానికంగా నాటు మందు వాడుతుంటారు. ఇది మరింత ప్రమాదకరం. నాటు వైద్యం పేరిట పసర్లు, వేర్లు, మంత్రాలంటూ కాలయాపన చేయకూడదు. పాము కాటు వేసిన వెంటనే స్థానికంగా ఉండే పల్లె దవాఖానకు తీసుకొస్తే శుభ్రం చేసి ప్రథమ చికిత్స అందజేస్తాం. ఆపై పీహెచ్‌సీ ఆస్పత్రికి చరలించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటాం. - రాజ్‌కుమార్, పల్లె దవాఖాన వైద్యుడు, వడ్డెకొత్తపల్లి

సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తి కిషన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ అనేక సంవత్సరాలుగా పేద విద్యార్థులకు చేయూతనిస్తూ, సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తి గుగులోత్ కిషన్ నాయక్ అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుగులోత్ కిషన్ నాయక్ ఆత్మీయ అభినందన సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రతీ ఉపాధ్యాయుడికి పదవి విరమణ సహజం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, ప్రొఫెసర్ భద్రునాయక్, టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ నర్సింహారెడ్డి, సంఘం నాయకులు సంకా బద్రినారాయణ, శ్రీశైలం, మల్లారెడ్డి, ఎక్బాల్, ఖుర్షిద్, పీరయ్య, రామ్మూర్తి, హరినాయక్, భీమానాయక్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



కిషన్‌నాయక్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మున్సిపాలిటీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో వర్షకాలం దృష్ట్యా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫాగింగ్ చర్యలు చేపట్టాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. పార్టీ 26వ వార్డు సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో ప్రజలు వ్యాధులకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 18న కురవి మండల కేంద్రంలో జరిగే సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మీ, ఎండి ఫాతిమా, నాంచారి దాసు, మైస శ్రీనివాస్, ఎండి.షంషీర్, భూక్య శంకర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ఎదుట మొక్క నాటాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రతి ఒక్కరూ ఇంటి ఎదుట మొక్క నాటాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతాద్రి హైమా గార్డెన్ వెల్ఫేర్ సొసైటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కాలనీ వాసులందరు ఐకమత్యంతో ఉండాలని, ఏ సమస్య వచ్చిన పరిష్కారం దిశగా ముందుడాలన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం హైమా గార్డెన్ ఆవరణలో ఎమ్మెల్యే మొక్క నాటారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు చల్లగుండ రాజేష్, ప్రధాన కార్యదర్శులు కన్న అశోక్‌బాబు, బిక్కి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, నాయకులు ఘనపురం అంజయ్య, వార్డు కౌన్సిలర్లు కొడి నాగలక్ష్మి శ్రీనివాస్, హరిసింగ్, భూక్య రవి, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాల మూలంగా ఇంటిల్లిపాది మంచాన పడ్డ పరిస్థితులు ఉన్నాయని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు తుడుం వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లో వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జనరల్ బోగీలను పెంచడంపై హర్షం

మహబూబాబాద్ అర్బన్: ప్రతి ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో జనరల్ బోగీలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆదివారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ... ఆరు నెలలుగా దేశ వ్యాప్తంగా రైళ్లల్లో జనరల్ బోగీలను పెంచాలని ప్రధాన మంత్రికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, కిరణ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వం

నెహ్రూసెంటర్: కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సంఘం జిల్లా ముఖ్యనాయకుల సమావేశం ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హామీలను అమలు చేయకపోగా కార్మికవర్గానికి నష్టం వాటిల్లే చర్యలు చేపట్టి కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలలు గడుస్తున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టడంలో విఫలమైందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ఉపేందర్, రాజమౌళి, శ్రీనివాస్, వీరన్న, నాగన్న, మల్లయ్య, మౌనిక, శ్రీశైలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్

సమాజాన్ని ముందుకు నడిపే శక్తిగా ఎదగాలి

నెహ్రూసెంటర్: యువతరం రాజకీయంగా ఉద్యమించి సమాజాన్ని ముందుకు నడిపించే శక్తిగా ఎదిగి ఆదర్శంగా నిలబడాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త లింగంపల్లి రాంబాబు అన్నారు. నాయీ బ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (నోపా) ప్రతిభ పురస్కారాల సన్మాన సభ ఆదివారం గంగపుత్ర భవన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఎనలేని కృషి చేసిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కర్పూరి ఠాకూర్‌ను ఆదర్శంగా తీసుకుని యువత పట్టుదలతో కృషి చేసి అనుకున్న రంగంలో రాణించాలని సూచించారు. నోపా అధ్యక్షుడు యలమందుల కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముద్దపాటి సూర్యనారాయణ, నోపా రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు రాపోలు సుదర్శన్, గజ్జల వెంకన్న, తూముల శ్రీనివాస్, కొలిపాక మల్లయ్య, లింగంపల్లి దయానంద్, నాగవల్లి నారాయణ, ఆకుర్తి సురేష్, జంపాల యాకయ్య, ఆలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంబాబు

నేటినుంచి నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న కవిత

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో నేటి నుంచి నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గార్లలో 30 పడకల ఆసుపత్రి నిర్మించి సకల సౌకర్యాలు కల్పించినప్పటికీ ఆసుపత్రిలో వైద్యపోస్టులు భర్తీ చేయకపోవడంతో మండల ప్రజలకు సరైన వైద్యం అందక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల పోస్టులు భర్తీ చేసేంత వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో అలువాల సత్యవతి, నాగమణి, రమ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం మెడికల్ కళాశాలకు అప్పగింత



మృతదేహాన్ని తరలిస్తున్న రవీందర్, మురళి

మహబూబాబాద్ రూరల్/మహబూబాబాద్: మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామంలో ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో మురుగన్ (45) అనే వ్యక్తి ఆదివారం మరణించగా మృతదేహాన్ని మహబూబాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఆదివారం ఉదయం తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతలు సంఘం, మహబూబాబాద్ లయన్స్ క్లబ్ ఆఫ్ నేతృత్వంలో అనాథ శవాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించే ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పరకాల రవీందర్ రెడ్డి, క్లబ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్ రెడ్డి. క్లబ్ జోన్ చైర్మన్ రావుల రవిచందర్ రెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కిట్ల పంపిణీ హర్షణీయం

మరిపెడ/మరిపెడ రూరల్: కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ హర్షణీయమని గోపా మరిపెడ మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్ అన్నారు. మరిపెడలో ఆదివారం ఆయన మాట్లాడారు. కిట్లలో తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్‌బ్యాగ్, లెగ్‌లూప్ వంటి పరికరాలు అందిస్తున్నారన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ రూరల్: మండలంలోని గాలివారిగూడెం గ్రామంలో గౌడ కులస్తుల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌడ కులస్తుల కమిటీ అధ్యక్షుడిగా చలమల ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా అలుదాసు వాసు, సభ్యులుగా సిల్వేరు ఉపేందర్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోలీసుల కళాజాతా

మరిపెడ రూరల్: సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కగిలి ఉండాలని ఎస్సై సంతోష్ అన్నారు. మండలంలోని బుర్హాన్‌పురంలో శనివారం రాత్రి మూఢనమ్మకాలు, డయల్ 100, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, గుట్కా, గంజాయి, డ్రగ్స్‌పై పోలీసుల ఆధ్వర్యంలో జాగృతి బృందంచే కళాజాతా నిర్వహించారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

కేసముద్రం: కేంద్ర ప్రభుత్వం మతతత్వ విధానాలను అవలంభిస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. సంస్కరణ పేరుతో కార్మిక చట్టాలను సవరిస్తూ పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను దోచే విధంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. ఈనెల 18న కురవిలో జరిగే సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శేఖర్, భాస్కర్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

18న సీపీఐ జిల్లా నిర్మాణ సమావేశం

కురవి: ఈనెల 18న మండల కేంద్రంలో సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి కరణం రాజన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్థికసాయం



కేసముద్రం: మండల కేంద్రంలోని జమలాపురానికి చెందిన పి.సునీత అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు ఆదివారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించాడు. అనంతరం రూ.2వేల ఆర్థికసాయంతోపాటు 50కేజీల బియ్యాన్ని అందజేశాడు. కార్యక్రమంలో ఎండి.అయూబ్‌ఖాన్, గండి వీరేందర్, కళాధర్, బానోతు బాలునాయక్, సుధాకర్, మిట్టగడుల జలేందర్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నర్సింపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన క్రమంలో పాలాయి శ్రీనివాస్‌ను పట్టణంలో పలువురు నాయకులు ఆదివారం శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, కందగట్ల టాకా రాజు, కల్వచర్ల ప్రవీణ్‌చారి, బలభక్తుల బ్రహ్మచారి, ఎస్.చందు, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన నాయకులకు పదవులు ఖాయం

చెన్నారావుపేట: ప్రజాసేవ చేసే అర్హులైన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం పదవులు కట్టబెట్టడం ఖాయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రానికి చెందిన కోరె కుమారస్వామి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులైన క్రమంలో ఆయన్ను మండల నాయకులు జోరు వీరయ్య, కుండె కుమారస్వామి, బొంత శ్రీను, తోట రాములుతో కలిసి ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆదివారం సన్మానించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. తద్వారా పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. పార్టీకి, ప్రజలకు సేవ చేసే వారికి అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డు ఆర్‌ఓబీబీ ప్రాంతంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. జిల్లాలోని బయ్యారం మండలం వినోబానగర్ గ్రామానికి చెందిన చెన్నబోయిన శ్రీనివాస్ తన ద్విచక్రవాహనంపై కురవి రోడ్డులో గల ఓ హోటల్లో భోజనం చేసేందుకు తన మిత్రులతో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాలార్ తండా వైపు నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సరార్ తండా ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

చెన్నారావుపేట: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పల్లకొండ కుమారస్వామి కోరారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికై ప్రమాణం స్వీకారం చేసిన సందర్భంగా ముత్తినేని వీరయ్యను హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

శిథిలావస్థకు వసతిగృహం

గార్ల: 30 ఏళ్ల క్రితం గార్లలో నిర్మించిన ఎస్సీ బాలికల వసతిగృహం భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో ఈ భవనం స్లాబు పెచ్చులు ఊడిన చోట వర్షానికి కురుస్తుండటంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహంలో 50 మంది బాలికలు ఉంటూ గార్లలోని బాలికోన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. వసతిగృహం భవనంలోని వరండా, కొన్ని గదులు కురుస్తున్నాయని బాలికలు పేర్కొన్నారు. వర్షాకాలంలో విద్యుత్ బోర్డులోకి నీరు చేరుకోవడంతో ఫ్యాన్, కరెంట్ స్విచ్‌లు ఆన్ చేసినప్పుడు ఒక్కోసారి విద్యుత్‌షాక్ వస్తుంది. ఇకపోతే వంటగది సైతం పూర్తిగా దెబ్బతిన్నది. వర్షం వచ్చినప్పుడు కురుస్తుంది. ఆరోజు పిల్లలకు వంట వండిపెట్టాలంటే చాల ఇబ్బందిగా ఉంటుందని వర్కర్లు పేర్కొన్నారు.



పెచ్చులూడిన భనవం పైకప్పు

దీనికి తోడు హాస్టల్ ప్రహరీ సైతం ఒకపక్క కూలిపోవడంతో బాలికలకు రక్షణ కరువైంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులు స్పందించి వసతిగృహం భవనంకు వెంటనే మరమ్మత్తులు చేపట్టి విద్యార్థినుల సమస్యలు తీర్చాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

విహారయాత్రకు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు



రామప్ప ఆలయంలో జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

దోర్నకల్: డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల చేపట్టిన విజ్ఞాన, విహార యాత్ర విజయవంతమైంది. ప్రైమ్ మినిస్టర్స్ రైజింగ్ ఇండియా స్కీంలో భాగంగా ములుగు జిల్లాలోని లక్నవరం సరస్సు, రామప్ప ఆలయాన్ని శనివారం విద్యార్థులు సందర్శించారు. హెచ్ నర్సింహరావు, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శంకర్, శ్రీనివాస్, మంజులత, అమీనా, వసంతరాణి, కృపాకాంత, గ్రేసమ్మ పాల్గొన్నారు.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

గార్ల: ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని అడిగిన మహిళను అసభ్య పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన ఆదివారం గార్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బోడ పార్వతి వద్ద, అంజనాపురం గ్రామానికి చెందిన గూగులోతు మధు తన ఇంటి అవసరాల నిమిత్తం 3ఏళ్ల క్రితం రూ.3లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పుగా ఇచ్చిన డబ్బులు చెల్లించమని పార్వతి పలుమార్లు మధును అడిగితే భూమి అమ్మిన తర్వాత ఇస్తానని చెప్పాడు. ఇటీవల మధు తన భూమిని అమ్మినట్లుగా పార్వతికి తెలిసింది. దీంతో పార్వతి మధు ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని అడిగింది. నీకు డబ్బులు ఇచ్చేది లేదంటూ పార్వతిని అసభ్య పదజాలంతో తిట్టి చంపుతానని బెదిరించాడు. ఈమేరకు పార్వతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై జీనత్‌కుమార్ మధుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.